క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుని కుటుంబానికి నగదు అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురానికి చెందిన దుక్కి బాలకృష్ణ(36) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి భార్యమీనాక్షికి వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమవుతాయన్నారు. ఏ ఒక్కరూ ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ బీమా ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ప్రవీణ్, శేఖర్, కన్వీనర్ సత్యనారాయణ, నాయకులు అంజి, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

ఏపీ 'మా' ఈసీ సభ్యుడిగా ఆదినారాయణ

గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఈసీ మెంబర్‌గా గోపాలపట్నం లక్ష్మీనగర్‌కు చెందిన పోలవలస ఆదినారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని ఏపీ 'మా' అధ్యక్షుడు దాడి సత్యనారాయణ అందించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధితో పాటు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారీలు

మల్కాపురం: మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థులకు క్రీడల వల్ల ప్రయోజనాలపై బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఇస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



మర్రిపాలెంలో తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, సిబ్బంది

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు మూడు రోజుల నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కంచరపాలెం మెట్టు, బర్మాక్యాంప్, బిర్లా జంక్షన్, మర్రిపాలెం, ఎన్ఏడీ వరకు ప్రత్యేక నిఘాతో తనిఖీలు చేపట్టగా మూడు రోజుల్లో 55 కేసులు నమోదయ్యాయి. 5వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వీరికి రూ.4.11 లక్షల జరిమానా విధించారని సీఐ మళ్ల అప్పారావు తెలిపారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

లబ్ధిదారులకు రక్ష.. 'జగనన్న సురక్ష'

- ప్రజలకు విశేష సేవలందించిన కార్యక్రమం
- 'పశ్చిమ'లో 12,000 పైగా ధ్రువపత్రాల అందజేత
- ఉచిత సేవలపై లబ్ధిదారుల హర్షం



గోపాలపట్నంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారుకు ధ్రువపతం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, అధికారులు(ఫైల్)

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఎందరో లబ్ధిదారులకు మేలు చేకూర్చింది. వేలాది మంది ప్రజలకు 11 రకాల సేవలను ఉచితంగా అందించింది. ప్రభుత్వ శాఖల నుంచి పలు రకాల ధ్రువపత్రాలను ఎటువంటి రుసుం లేకుండా అందజేశారు. కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగే పనిలేకుండా సచివాలయం-వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే అవసరమైన సర్టిఫికెట్లు రెండు, మూడు రోజుల్లోనే వచ్చి చేరాయి. తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు చిట్టచివరి లబ్ధిదారు వరకూ అంతా అర్హత సాధించినట్లయింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలు కనుక్కొని వారి చేత ఆయా సర్టిఫికెట్లకు దరఖాస్తు చేయించారు. అవి మూడు రోజుల్లోనే మంజూరు కావడంతో లబ్ధిదారులు వాటిని అందుకుని హర్షం వ్యక్తం చేశారు. సచివాలయాల పరిధిలో ప్రత్యేకంగా జగనన్న సురక్ష క్యాంప్‌లు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అధికారులు, నాయకులు అందజేశారు. అదే వేదిక వద్ద జీవీఎంసీ అధికారులతో కలిసి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి.. వాటిని తక్షణమే పరిష్కరించారు. ప్రజలందరికీ మేలు చేకూర్చేందుకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'పశ్చిమ'లో లబ్ధిదారులకు అందించిన ధ్రువపత్రాల వివరాలు

జోన్	వార్డు నం.	ధ్రువపత్రాలు
8	89	1,117
8	90	920
8	91	1,822
8	92	2,884
5	52	421
5	56	604
5	57	217
5	58	1,464
5	59	903
5	61	944
5	63	693

జోన్-8, జోన్-5 పరిధుల్లో..

పశ్చిమ నియోజకవర్గంలోని జీవీఎంసీ జోన్-8, జోన్-5 పరిధి వార్డుల్లో లబ్ధిదారులకు 12,000కు పైగా ధ్రువపత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందజేశారు. ఇంకా మంజూరు కావాల్సినవి ప్రోసెస్‌లో ఉన్నాయి. మరి కొన్ని వార్డుల్లో జగనన్న సురక్ష క్యాంప్‌లు జరగాల్సి ఉంది. లబ్ధిదారులు దరఖాస్తు చేసిన వాటిలో పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాలను సైతం త్వరితగతిన మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు.

ఒక్క రోజులోనే ధ్రువ పత్రం



జగనన్న సురక్ష చాలా మంచి కార్యక్రమం. ఆయా ధ్రువపత్రాల ఎంతో మందికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియదు. వలంటీర్లు ఇంటికి వచ్చి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సర్టిఫికెట్ల గురించి వివరించారు. నా చేత దరఖాస్తు చేయించారు. ఒక్క రోజులోనే కుల ధ్రువపత్రం అందించారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– కలమటి మోహనరావు, సుసర్ల కాలనీ, 90వ వార్డు

ఎక్కడికీ వెళ్లకుండానే కుల ధ్రువపత్రం



గతంలో కుల ధ్రువీకరణ పత్రం కోసం అనేక ఇబ్బందులు పడ్డాను. ఎక్కడికి వెళ్లిన సరైన పత్రాలు లేవంటూ తిరిగి పంపేవాళ్లు. నేడు ఎక్కడికీ వెళ్లకుండా చేతికే సర్టిఫికెట్ అందజేశారు. జగనన్న సురక్ష క్యాంప్‌ను ప్రవేశపెట్టిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– సత్యవతి, గోపాలపట్నం, 92వ వార్డు

ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించా



కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం గతంలో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితముండేది కాదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు మా ఇంటికి వచ్చి కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేయించి జగనన్న సురక్ష క్యాంప్‌లో అందజేశారు. ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించడం చాలా సంతోషంగా ఉంది.

– మోహనరావు, గోపాలపట్నం, 92వ వార్డు

ఆడారి సొంత నిధులతో పలువురికి పింఛన్



పింఛన్ అందిస్తున్న పార్టీ నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలో పలువురికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులతో పింఛన్ సమకూర్చారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ నాయకులు పింఛన్ నగదు లబ్ధిదారులకు అందజేశారు. గత నెలలో ఇందిరాకాలనీలో ఆనంద్‌కుమార్ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాంతానికి చెందిన నలుగురికి అర్హత ఉన్నా సాంకేతిక కారణాల వల్ల పింఛన్ మంజూరు కాలేదని గుర్తించారు. దీంతో వారికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసే వరకు తన సొంత నిధులతో ప్రతి నెలా పింఛన్ అందిస్తానని ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. దాని ప్రకారం పింఛన్ డబ్బులను వార్డు పార్టీ నాయకులు కలిదిండి బద్రీనాథ్, జీఎల్‌వీ నరేష్, మళ్ల ధనలత, సత్తిబాబు,త్రినాథ్,నరేష్ తదితరులు వారి ఇళ్లకు వెళ్లి అందించారు. దీంతో వారు ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

38జే బస్సు పునరుద్ధరించాలని ఆందోళన



గాజువాక డిపో వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు,కార్యకర్తలు

మల్కాపురం: 38జే బస్సును క్రాంతినగర్ మీదుగా కాకరలోవ ప్రాంతం వరకు నడపాలని సీపీఎం, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై వారు గాజువాక డిపో వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జనతాకాలనీ వరకు వచ్చిన 38జే సర్వీసును డిపో యాజమాన్యం నిలిపి వేయడం దారుణమన్నారు. ఆయా ప్రాంత ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. డిపో అధికారులు స్పందించి 38జే బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఆ సర్వీస్‌ను క్రాంతినగర్ మీదుగా కాకరలోవ ప్రాంతం వరకు కొనసాగించాలని డిపో అధికారులకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన అధికారులు ఆ ప్రాంతానికి వచ్చి బస్సు నడిపేందుకు అనుకూలంగా ఉందో లేదో గుర్తించిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారని సీపీఎం నాయకలు వివరించారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం,ఐద్వా ప్రతినిధులు రామారావు,జయలక్ష్మి, ఆర్.విమల,బి.మమత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం విధానాలు మార్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

మల్కాపురం: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ యోచనను విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు డిమాండ్ చేశారు. మల్కాపురం గ్రామ మండలి వద్ద శుక్రవారం సాయంత్రం ఆ పార్టీ జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు కార్పొరేట్ సంస్థలకు అమ్ముడుపోయిన మోదీ సర్కార్ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని ఆరోపించారు. రాష్ట్రంలో ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లు పెరిగిపోయాయని వీటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 17వ తేదీన కూర్మన్నపాలెం నుంచి బస్సు యాత్ర చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యాంజనేయ, గుడాల రాంబాబు,సత్తిబాబు, పోతిన రాము,గండి అప్పారావు,త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యునికి వైద్య సేవలు

మల్కాపురం: గాయపడిన ఓ వ్యక్తి వారం రోజుల నుంచి సర్వీసు రోడ్డులో ఉన్నాడని తెలుసుకుని షిర్డీ సాయిబాబా చారిబుల్ ట్రస్టు ప్రతినిధులు ఆ వ్యక్తికి వైద్య సేవలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. జింక్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆ వ్యక్తి కాలుకు గాయం అయింది. నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న 60వ వార్డు గుల్లలపాలెంలోని షిర్డీసాయిబాబా చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు శుక్రవారం గాయపడిన వ్యక్తికి వైద్య సిబ్బంది సాయంతో సేవలు అందించారు. అనంతరం వస్త్రాలు అందించిగుల్లలపాలెంలోని హాకర్స్ జోన్ పాయింట్‌కు తీసుకువచ్చి కాలు నయం అయ్యే వరకు ఇక్కడ సేద తీరమని చెప్పారు. గాయపడిన వ్యక్తి వివరాలు అడిగితే చెప్పలేని పరిస్థితిలో ఉన్నాడని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

పౌష్టికాహారం ఆరోగ్యకరం



గణేష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార కిట్లు అందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



పాత గోపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో కిట్లు అందజేస్తున్న బెహరా భాస్కరరావు



61వ వార్డులో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుధ

గోపాలపట్నం: పౌష్టికాహారం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం 52వ వార్డు ఎన్ఏడీ జంక్షన్ గణేష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆయన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు(టేక్ హోం రేషన్) అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోషకాహార కిట్లు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బీఎస్ కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, సచివాలయం జిల్లా కో ఆర్డినేటర్ ప్రసాద్, అంగన్‌వా టీచర్ దేవి, మార్తా, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

91వ వార్డు పాత గోపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, గేదెల మరళీకృష్ణ, ఊటపల్లి గోవిందు, గొంతిన నాగరాజు, పి.ఎస్.రాజు, పసుపురెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు ఆరోగ్యంపై శ్రద్ధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు హరిజన వీధిలోని సామాజిక భవనంలో గర్భిణులు, బాలింతలకు కార్పొరేటర్ కొణతాల సుధ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలనే ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తోందన్నారు. మాతా, శిశువులపై జగనన్న చూపుతున్న ప్రేమను ఎన్నడూ మరవకూడదన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, స్థానిక నాయకులు పిలక రామ్మోన్‌రెడ్డి, పాండు, జీవీఎస్ఎన్ రాజు, ఆడారి అప్పారావు, కొల్లి నూకరెడ్డి, బూస అప్పలరెడ్డి, చట్టి నూకరాజు యాదవ్, పిలక వరలక్ష్మి, స్వప్న, మంగయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

సీతంపేట: శెట్టిబలిజ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని పలువురు వక్తలు కోరారు. శెట్టిబలిజల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శెట్టిబలిజ సంఘ నాయకులు, సభాధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ విశాఖలో శెట్టిబలిజ, యాత, శ్రీశయన, గౌడ కులస్తులు 4 లక్షల ఓటర్లు ఉన్నప్పటికీ ఏ రకమైన రాజకీయ ప్రాధాన్యం లేకపోవడం అన్యాయమన్నారు. ప్రతి నియోజకవర్గంలో తమ కులస్తుల ఓట్లు 30 వేల నుంచి 40 వేలకు ఉన్నాయని తెలిపారు. 2024 ఎన్నికల్లో శెట్టిబలిజ కులాలకు ప్రాధాన్యమిచ్చే రాజకీయ పార్టీలకు మాత్రమే తమ మద్దతు ఉంటుందన్నారు. విశాఖలో ఒక ఎమ్మెల్యే, ఒక నామినేటెడ్ పదవిని కేటాయించిన పార్టీకి మద్దతు పలుకుతామని స్పష్టం చేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్టీ సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ శెట్టిబలిజ కులాలను సంఘటితపరిచి, ఒక తాటిపైకి తీసుకొచ్చి త్వరలో భారీ ఎత్తున మహానాడు సభ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ కులస్తులు, వివిధ హోదాల్లో పదవీ విరమణ చేసిన ప్రముఖ వైద్యాధికారులను ఘనంగా సత్కరించారు. విశ్రాంత రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ కడలి సత్యవరప్రసాద్, మానసిక ఆస్పత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ కుముజు నరసింహారెడ్డి, పోర్టు ఆస్పత్రి డెర్మటాలజిస్ట్ యాంత్ర రాంప్రసాద్, కేజీహెచ్ గైనకాలజిస్ట్ యాంత్ర లక్ష్మీ నరసింగరావు తదితరులను దుశ్శాలువాతో సన్మానించారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: మురళీనగర్-మాధవధార వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలమ కుటుంబాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారు, పదో తరగతి పాసైనవారు, వివిధ సాంకేతిక విద్యా పరీక్షల్లో పాలిసెట్, ఈఏపీఈసెట్, జేఈఈ, నీట్, సివిల్స్‌లో ఉత్తమ ర్యాంకులు పొందిన వెలమ సామాజిక వర్గ విద్యార్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మురళీనగర్‌లోని వెలమ సంక్షేమ సంఘం కార్యాలయంలో లేదా 99496 57734 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

32వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్ష శిబిరంలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారం నాటికి 32వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొవిరి అప్పలరాజు, వాసుపలి ఎల్లాజీ, మాద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంఘిక నాటికలు



అమ్మ మారి పోయింది నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): విశాఖ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రదర్శించిన రెండు సాంఘిక నాటకలు ఆకట్టుకున్నాయి. ఈ నాటిక ప్రదర్శనలను వీఎండీఏ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, పైడా కృష్ణప్రసాద్, జగత్‌రాయ్, నాంచారయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం తొలి ప్రదర్శనగా డి.సత్యనారాయణ దర్శకత్వంలో రావి నాగేశ్వరరావు రచించిన అమ్మ మారిపోయింది నాటికను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటికలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులను కదిలించింది. రెండో ప్రదర్శనగా పుష్పమి దర్శకత్వంలో కె.వి.మెమోరియల్ ఆర్ట్స్ యూనిట్ రచించిన అడ్రస్ లేని మనిషి నాటిక ఆలోచింపజేసింది. ఈ నాటికలకు సౌజన్య ఉక్కు కళా ప్రవంతి కళాకారులు ప్రదర్శించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న పుర్రె సురేష్‌యాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డులో అభివృద్ధి పనులకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద సుమారు రూ.2.2 కోట్లతో సీసీ రోడ్డు, జీవీఎంసీ పాఠశాల అదనపు అంతస్తుల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేసిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు తమ వార్డు ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రేవళ్ల సత్యనారాయణ, పెంటారావు, ధర్మారావు, రాజు, జిలానీ,మంజులత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



చిన్నారులకు అందించే భోజనాన్ని పరిశీలిస్తున్న కాంతారావు

మల్కాపురం: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు శుక్రవారం జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇక్కడ గల పలు రేషన్ డిపోలను తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేని వారిపై చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.కార్యక్రమంలో డీఎస్‌వో సూర్యప్రకాష్, ఏఎస్‌వో టి.కృష్ణ, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడంలో విస్కా కృషి భేష్



సాంస్కృతిక విజయోత్సవాలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: సాహిత్యం, నృత్యం తదితర కళలను, కళాకారులను ప్రోత్సహించడంలో విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) కృషి ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చీ అన్నారు. విస్కా ఆవిర్భవించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న సాంస్కృతిక విజయోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాగ్చీ మాట్లాడుతూ నలభై ఏళ్ల పాటు అనేక కార్యక్రమాల ద్వారా కళాభిమానులను అలరించిన విస్కా భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. విస్కా అధ్యక్ష, కార్యదర్శులు నేమాని శ్రీనివాసశర్మ, ఎ.కేశవరావు మాట్లాడుతూ అందరి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా నాట్యోపాసన పురస్కార గ్రహీత డాక్టర్ లావణ్య శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్యం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉక్కు విశ్రాంత డైరెక్టర్ ఎస్.ఎస్. రావు, లాస్య నృత్యాలయ స్థాపకురాలు డాక్టర్ లావణ్య, డి.ఆదినారాయణ, కళాక్షేత్రం కార్యదర్శి సత్యనారాయణ, విస్కా కార్యవర్గ సభ్యులు జి.ఎస్.ఆర్. కిషోర్, డి. దుర్గాప్రసాద్, ఈరంకి శ్రీనివాస్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం

సింహాచలం: వెంకటాద్రిపై శుక్రవారం వెంకన్న కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చాతుర్మాస పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం , కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.